క్లుప్తంగా

టోల్ ప్లాజా వద్ద కార్మికుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న టోల్ ప్లాజా కార్మికులు

టంగుటూరు: సమస్యల పరిష్కారం కోసం టోల్‌ప్లాజా కార్మికులు ధర్నా చేశారు. టంగుటూరు టోల్ ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం మూడో రోజు కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, నేషనల్ హాలీడే, టికెట్ క్యాన్సిలేషన్ చేయాలని, హాజరు విషయంలో సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. రానున్న రోజుల్లో సమస్యల పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ సుబ్బారావు, రాము, శ్రీనివాసులు, అయ్యప్ప, తిరుమల, కాశీ విశ్వనాథ్, పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంఈవో హరిబాబు

పొన్నలూరు: విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఎంఈవో తన్నీరు హరిబాబు పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచే క్రమశిక్షణ కలిగి ఉత్తమ విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ-1 రవిచంద్రబాబు, సర్పంచ్ కొరకూటి మమత, మాజీ సర్పంచ్ గుమ్మళ్ల వెంకట్రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల బలోపేతానికి కృషి



అగ్రహారంలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

పొన్నలూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించి కళాశాల బలోపేతానికి కృషి చేయాలని ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు అన్నారు. మండలంలోని లింగంగుంట, కే అగ్రహారం, తిమ్మపాలెం గ్రామాల్లో శుక్రవారం కళాశాల సిబ్బంది అడ్మిషన్‌ల కోసం కళాశాల సమాచారంతో ముద్రించిన కరపత్రాలతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పొన్నలూరులో ప్రభుత్వ కళాశాల స్థాపించిన దగ్గరి నుంచి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు సెకండ్ ఇయర్ ఎంపీసీలో అభిషేక్ 928, ఫస్ట్ ఇయర్‌లో సీఈసీలో మధురవాణి 472 మార్కులు సాధించిందన్నారు. కళాశాలకు పక్కా భవనంతో పాటు అన్ని రకాల వసతులు ఉన్నాయన్నారు.



అధ్వానంగా ఉన్న పాకల-ఊళ్లపాలెం రోడ్డు



పాకల-కేశుపాలెం రోడ్డు దుస్థితి ఇలా..

అబద్ధాల రోడ్లు.. బాగున్నాయి కదా బాబూ!

- గతుకుల రోడ్లతో అవస్థలు పడుతున్న ప్రజలు
- ఐదు నిమిషాల ప్రయాణానికి అరగంట సమయం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు

సింగరాయకొండ:

పండగలన్నీ అయిపోయాయి.. అందరూ ఎవరి పనుల్లో వారు బిజీ అయిపోయారు. కాని కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లు మాత్రం గుంతలతో వీడ్కోలు పలికాయి. ఉగాది నాటికి మీరు ఊర్లకు వచ్చేసరికి రోడ్లన్నీ అద్దంలా మెరిసేలా చేస్తాం.. అని కూటమి సీఎం చంద్రబాబు ప్రగల్భాలు పలికారు. తీరా చూసేసరికి ఒక్క గుంతను కూడా పూడ్చిన పాపానా పోలేదు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా సింగరాయకొండ మండలంలో గ్రామీణదారులు దారుణంగా కనిపిస్తున్నాయి. మండలంలోని ఊళ్లపాలెం-శానంపూడి, జాతీయ రహదారి నుంచి పెద్ద కనుమళ్ల, సింగరాయకొండ-పాకల, పాకల- ఊళ్లపాలెం, పాకల-కేశుపాలెం, పాకల-రావివారిపాలెం రహదారి ఇలా చెప్పుకుంటూ పోతే ఏ రహదారి చూసినా గతుకులమయంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు బాహాటంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈరోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై సుమారు 10 నెలలు పూర్తవుతున్నా రోడ్లకు మరమ్మతులు చేయటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



సింగరాయకొండ-శానంపూడి రహదారి దుస్థితి ఇలా..



గుంతలమయంగా పాకల-సింగరాయకొండ రహదారి

గుంతల రోడ్లపై ప్రమాదాలు..

ఈరోడ్లపై ప్రయాణాలు చేయాలంటే ప్రజలు, వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గత ఫిబ్రవరిలో పాకలకు చెందిన వాయిల రాము పాకల నుంచి సింగరాయకొండ వస్తుండగా మర్రిచెరువు సమీపంలో గుంతలో మోటారుసైకిల్ అదుపు తప్పడంతో కిందపడి తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఇదే రోడ్డులో ఓ ప్రైవేటు స్కూలు బస్సు ప్రమాదవశాత్తు రోడ్డు మార్జిన్‌లోని పొలాల్లోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇలా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాక ఈరోడ్లపై 10 నిమిషాలలో వెళ్లే దూరానికి అరగంట పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు యుద్ధప్రాతిపదికన గ్రామీణ రోడ్లు మరమ్మతులు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నరకం చూస్తున్నాం..



శానంపూడి నుంచి సింగరాయకొండకు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా ఉంది. ఈ రహదారిలో కిరాణా సామానులు తెచ్చుకోవాలంటే నరకం కనబడుతోంది. గత ఆరునెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో 5 నిమిషాల్లో జాతీయ రహదారి నుంచి శానంపూడి వెళ్లేవాడిని. కాని ప్రస్తుతం గుంతల కారణంగా సుమారు 20 నిమిషాలకు పైగా పడుతుంది.

– పంతగాని నరశింహారావు, కిరాణా వ్యాపారి, శానంపూడి

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం..

మండల పరిధిలో సింగరాయకొండ నుంచి గ్రామాలకు వెళ్లే రహదారులు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న రహదారులకు నెలరోజుల క్రితం ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– టీ రమణయ్య, పంచాయతీరాజ్, డీఈ

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



కొండపిలో గ్యాస్ గొడౌన్ సిబ్బందికి సూచనలిస్తున్న అగ్నిమాపక అధికారులు

కొండపి/టంగుటూరు: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి సీహెచ్ వెంకటరావు సూచించారు. శుక్రవారం కొండపిలోని పలు గ్యాస్ గోదాములు, పెట్రోలు బంక్‌ల వద్ద సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అ నంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్యాస్ గోదాములు, పెట్రోల్ బంకుల వద్ద సీవోటూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదం సంభవించడం వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని వెనువెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని నివారిస్తామని తెలిపారు. ఎండలు అధికంగా ఉన్నందువలన పెట్రోల్ నింపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కరపత్రాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఫైర్ సిబ్బంది, గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంకుల యాజమాన్యాలు,ప్రజలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యంగా అగ్నిమాపకశాఖ 24 గంటలు అందుబాటులో ఉంటుందని టంగుటూరు అగ్నిమాపక కేంద్రం అధికారి రమణారెడ్డి తెలిపారు. మండలంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే డయల్ 101తో పాటు 85922 42669, 99637 33671కు ఫోన్ చేయాలన్నారు.

కనిగిరిరూరల్: అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తతే ఆయుధం అని అగ్నిమాపక అధికారి సీహెచ్ బంగారు బాబు అన్నారు. పట్టణంలోని పలు గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోలు బంక్‌ల సిబ్బందికి అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో ఆగిన నీటి సరఫరా



నీళ్లు లేక ఒట్టిపోయిన కుళాయిలు

- పొంతన లేని మాటల్లో అధికారులు
- తాగునీటి కోసం ప్రజల అవస్థలు
- మరమ్మతుల పేరుతో 12 రోజులుగా అంతరాయం

కనిగిరిరూరల్: కారణాలు ఏమైనా గత 12 రోజులుగా గ్రామీణ నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. మూడురోజుల నుంచి కనిగిరి రక్షిత మంచినీటి సరఫరా నిలిచి పోవడంతో సమస్య జఠిలమైంది. దీంతో పట్టణ, రూరల్ గ్రామాల ప్రజలు అవస్తలు పడుతున్నారు. కనిగిరి సమగ్ర రక్షిత మంచి నీటి పథకం ద్వార పునుగోడులోని హెడ్‌వర్క్స్ నుంచి కనిగిరి నియోజకవర్గంలోని 191 గ్రామాలకు గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో సాగర్ జలాలను అందిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పుండగా.. దర్శి సంప్ నుంచి కనిగిరి పట్టణ ప్రజలకు సాగర్ జలాలను అందిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే రెండు పథకాలు ఒక్క సారిగా ఎందుకు నిలిచాయన్నది సవాలక్ష ప్రశ్నగా మారింది. దీంతో కనిగిరి మున్సిపాలిటీ, కనిగిరి రూరల్, పీసీపల్లి, పామూరు, వెలిగండ్ల మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆగిన జలాలపై భిన్న స్వరాలు..

రామతీర్థం రిజర్వాయర్ నుంచి కనిగిరి మండలంలోని పునుగోడు హెడ్‌వర్క్స్‌కు నీళ్లు చేరుతాయి. అక్కడినుంచి కనిగిరి పట్టణంకు ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, సంప్‌ల ద్వారా, అలాగే పునుగోడు సంప్‌ల నుంచి మాచవరం మీదుగా మిగతా మండలాలకు సరఫరా అవుతాయి. అయితే పంపింగ్ పైప్ లైన్ పగిలి పోయినట్లు, ట్రాన్స్‌ఫారం కాలినట్లు, బీకేవీ రోడ్డు వలన లీకు పడినట్లు, మర్రిపుడి నుంచి వచ్చే పాత పైప్ లైన్ డ్యామేజ్ జరిగినట్లు, మాచవరం వద్ద మోటార్‌లు కాలినట్లు ఇలా రోజుకో కారణాలు చెప్తున్నారు. వాస్తవానికి కాంట్రాక్టర్ కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడం కారణంతో నీటి సరఫరా పనులు, మరమ్మత్తు పనులు సక్రమంగా, వేగంగా జరగడం లేదనే ఆరోపణలున్నాయి. అయితే దర్శి నుంచి కనిగిరికి వచ్చే పట్టణ నీటి పథకం ఎందుకు ఆగిందనేది ప్రశ్నార్థకం. ప్రధానంగా కనిగిరి పట్టణంలోని 20 వార్డుల్లో సుమారు 60 వేల మంది జనాభ తాగు నీటి కోసం అల్లాడుతున్నారు. పట్టణంలోని దొరువు వద్దగల ఒహెచ్‌ఆర్ ట్యాంక్ వద్దకు వచ్చి కుళాయిల నుంచి వచ్చే నీటిని పట్టుకుండగా.. మరి కొందరు గత్యంతరం లేక తాగు నీటిని కొనుగోలు చేస్తున్నారు.

పట్టణ సరఫరా మాకు సంబంధం లేదు..

పునుగోడు హెడ్‌వర్క్స్, మాచవరంలో మోటర్‌లు రిపేర్లు, పైప్‌లైన్ లీకుల మరమ్మత్తుల కారణంగా నీటి సరఫరా నిలిచింది. హైవేరోడ్డు, రైల్వేలైన్ పనుల కారణంగా పైప్ లైన్ లీకులు పడుతున్నాయి. వాటిని రిపేరు చేసే క్రమంలో నీటి సరఫరాకు కొంత అంతరాయం జరుగుతున్నుట్ల కనిగిరి, ఏఈ శ్రీకాంత్ చెప్పారు. ఈనెల 23 నాటికి రామతీర్థం నుంచి పునుగోడుకు హెడ్వర్క్స్‌కు తరలించి దశలవారిగా అన్ని గ్రామాలకు నీళ్లు అందిస్తామని చెప్పారు.

కమిషనర్ ఏమంటున్నారంటే..

దీనిపై కమిషనర్ డానియల్ జోసఫ్ మాట్లాడుతూ రెండురోజుల్లో దర్శి సంప్ నుంచి పొదిలి, చినారికట్ల, చల్లగిరిగిల్ల మీదుగా కనిగిరి ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌కు నీళ్లు ఎక్కిస్తామన్నారు. తాను కమిషనర్‌గా వచ్చిన తర్వాత రూ.20 లక్షలు పెట్టి పైప్‌లైన్ మరమ్మతులు చేయించామని.. అందువల్ల వాటిని చెక్ చేసి రెండ్రోజుల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగంతో సంబంధం లేకుంగా పట్టణానికి నీళ్లు ఇస్తామని వెల్లడించారు.

కూటమి సర్కార్‌ను ప్రజలు ఛీకొడుతున్నారు



మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్, పక్కన చింతల చెరువు, బన్నీ



తిరునాళ్లలో పాల్గొన్న ప్రజలు

- రాష్ట్రంలో కూటమి దుష్టపాలన
- రాబోయే రోజులు వైఎస్సార్ సీపీవే
- తిరునాళ్ల మహోత్సవంలో దద్దాల, బన్నీ, చింతలచెర్వు

కనిగిరిరూరల్: కూటమి సర్కార్‌కు కాలం దగ్గర పడింది.. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని ఏరువారిపల్లిలో అంకాళమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల వేదికపై సర్పంచ్ దమ్ము వెంకటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ) లతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా దద్దాల మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో అబద్ధపు హామీలతో కూటమి సర్కార్ గద్దెనెక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఘాటుగా విమర్శించారు. జగనన్న 2.0లో ఒక కన్ను ప్రజలు, ఒక కన్ను కార్యకర్తలుగా పరిపాలన సాగిస్తారని వెల్లడించారు. పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

అనంతరం చింతల చెరువు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయని కూటమి సర్కార్‌ను పది నెలల్లోనే రాష్ట్ర ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. రాబోయే రోజులు వైఎస్సార్ సీపీవే నని 2029 మళ్లీ జగనన్న సీఎం కావడం ఖాయమన్నారు.

సంక్షేమపాలన అందించి జగనన్నే..

పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ) మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే నన్నారు. నేటి కూటమి సర్కార్ సూపర్ సిక్స్‌పేరితో రాష్ట్ర ప్రజలకు సున్నం పెడుతుందని ఘాటుగా విమర్శించారు. తొలుత గ్రామ సర్పంచ్, వీరంరెడ్డి బ్రహ్మరెడ్డిలు పార్టీ నాయకులకు ఘన స్వాగతం పలికారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో పార్టీ దద్దాల, చింతల చెరువు, బన్నీ పార్టీ నేతలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంకాళమ్మ తల్లి ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజల్లో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ నేతలకు స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతి రెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవుల భాస్కర్‌రెడ్డి, డాక్టర్ రసూల్, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కటికల వెంకట రత్నం, ఉడుముల లక్ష్మీ నారాయణరెడ్డి, స్వర్ణ ఏడుకొండలురెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, సంగు వెంకటేశ్వరరెడ్డి, శేషిరెడ్డి, కృష్ణారెడ్డి, పిచ్చిరెడ్డి, ముద్దా బాబు, జీవరత్నం, మూలే చిన్నపురెడ్డి, అమర్నాథ్‌రెడ్డి (నాని), వడ్డే రవి, శ్రీహరిరెడ్డి, ఆటో జగన్, ఉస్మాన్, మాబాషా, సిద్దారెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, గంజి రవీంద్రారెడ్డి, ఫణీంద్రారెడ్డి, అంజీ, రమేష్‌రెడ్డి, మడతల వెంకటేశ్వరరెడ్డి, తాతపుడినాని, గోనా జమ్స్, కేశవ, ఈర్ల శ్రీను, ఇండ్లా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జగతికి శాంతి సందేశాన్నిచ్చిన ఏసుక్రీస్తు



టంగుటూరులో సువార్త ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



గుండ్లసముద్రంలో శిలువను మోస్తున్న క్రైస్తవులు

- భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

కొండపి/టంగుటూరు/మర్రిపూడి/పొన్నలూరు: జగతికి శాంతి సందేశానిస్తూ క్రీస్తు శిలువనెక్కిన రోజైన గుడ్‌ఫ్రై డేను మండలంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొండపి పట్టణంతో పాటు మండల పరిధిలోని చర్చిల్లో క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాంతియుత సమాజం కోసం సన్మార్గ జీవన మార్గాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఏసుప్రభువు శిలువను ఎక్కిన రోజుగా భావించి ఉపవాస దీక్షలు చేపట్టారు. కొండపిలోని పాత కుమ్మరిపాలెంలో ఉన్న షాలేము ప్రార్థన మందిరంలో దైవ సేవకుడు మైఖేల్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. ఏసు క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించారు. దాసిరెడ్డిపాలెంలోని హెచ్‌ఎస్‌పీఎం ప్రధాన మందిరంలో పాస్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో, బీసీ కాలనీలోని ఎరూషలేం ప్రార్థన మందిరంలో పాస్టర్ సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

మర్రిపూడి, పొన్నలూరు మండలంలోని పలు చర్చిల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక బాప్టిస్టు నగర్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ఉపవాస ప్రార్థనలు ఉదయం నుంచే ప్రారంభమయ్యాయి. పాస్టర్ చుండి ప్రభాకర్ వాక్యోపదేశం చేస్తూ సమస్త మానవాళి పాపాల కోసమే ఏసుక్రీస్తు శిలువలో మరణం పొందారన్నారు.

టంగుటూరు మండలంలోని వెంకటాయపాలెం రోడ్డులో ఉన్న న్యూలైఫ్ పరిశుద్ధ ఆరాధన మందిరంలో గుడ్ ఫ్రై డే ఆరాధన నిర్వహించారు. జయవరంలోని జాయ్ చర్చిలో పాస్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్, రెవరెండ్ డాక్టర్ సుదర్శన్ క్రీస్తు సందేశాలు అందించారు. పాస్టర్ యేసురత్నం, దెబోరా రత్నం పాల్గొన్నారు.

క్రీస్తుబోధనలు అనుసరణీయం..

సీఎస్‌పురం (పామూరు)/పామూరు/హనుమంతునిపాడు: క్రీస్తు బోధనలు అనుసరణీయమని రెవరెండ్ ఫాదర్ బీ మనోహర్ అన్నారు. గుడ్‌ఫ్రై డే వేడుకలను మండల కేంద్రం సీఎస్‌పురం, గణేశునిపల్లి ఆర్సీఎం చర్చిలో గుడ్ ఫ్రైడే కార్యక్రమంలో కమిటీ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు మండలంలోని ఆర్సీఎం చర్చి పరిధిలో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడ్ సిలువ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు సిలువ మోస్తూ ప్రత్యేక ప్రార్థనతో యాత్ర నిర్వహించారు.



పొన్నలూరు టీబీసీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



పామూరులో క్రీస్తు బోధనలు వివరిస్తున్న క్రైస్తవ సోదరి

పామూరులోని సీఎస్‌పురం రోడ్డులోని తెలుగు బాప్టిస్టు చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో ఫాస్టర్ జోసఫ్ గుడ్‌ఫ్రైడే సందేశం ఇచ్చారు. ఈసందర్భంగా క్రైస్తవులు ఆలపించిన గీతాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

అవినీతిమయంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



యన్నాబత్తిన చిన్నా

సింగరాయకొండ: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి మయంగా మారిందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ యన్నాబత్తిన చిన్నా ఒక ప్రకటనలో ఆరోపించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వం నిర్ణయించిన స్టాంపు డ్యూటీ మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా తమ ఇష్టం వచ్చినట్లు ఒక్కో డాక్యుమెంటుకు ఒక్కో రేటు వసూలు చేస్తున్నారన్నారు. సబ్ రిజిస్ట్రార్ సమయపాలన పాటించటం లేదని ఆయన ఎప్పుడు వస్తారో అర్థం కాదని, ఆయన వచ్చినప్పుడే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. వివాహ సర్టిఫికెట్లకు కూడా ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నారని కావున ఉన్నతాధికారులు కార్యాలయంపై సమగ్ర విచారణ జరిపి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

పొన్నలూరు: వాహనదారులు నిబంధనలు పాటించకుండా నడిపితే చర్యలు తప్పవని ఎస్సై కే అనూక్ హెచ్చరించారు. రహదారి భద్రతలో భాగంగా పొన్నలూరులో శుక్రవారం ఆటోలు, ట్రాక్టర్లు ఇతర వాహన డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చాకు లోడుతో వెళ్లే ట్రాక్టర్లు సైడ్ డోర్లు తీసి కూలీలను ఎక్కించడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా..

సింగరాయకొండ: స్వీయ రక్షణకు హెల్మెట్‌లు వాడాలని సూచిస్తే.. నిర్లక్ష్యం చేస్తున్నారని ఇకపై విస్తృతంగా తనిఖీలు జరిపి జరిమానాలు విధిస్తామని ఎస్సై బి మహేంద్ర వాహనదారులను హెచ్చరించారు. మండల పరిధిలోని జాతీయ రహదారిపై విమానాల రన్‌వే వద్ద కనుమళ్ల రోడ్డు జంక్షన్‌లో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్సై మహేంద్ర మాట్లాడుతూ మొదటిసారి హెచ్చరికలతో వదిలేస్తున్నామని ఇకపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రెండు ట్రాక్టర్లకు సరైన ధ్రువపత్రాలు లేకపోవటంతో జరిమానా విధించారు.

షిఫ్ట్ ఆపరేటర్‌కు విద్యుదాఘాతం

ఉలవపాడు: సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. అలగాయపాలెం సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శరణ్యకు విద్యుత్ షాక్ తగలడంతో గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైరు తెగిపడింది. అధికారుల ఆదేశాల మేరకు మరమ్మతులు చేయడానికి వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. తలకు గాయమైనట్లు స్థానికులు తెలిపారు. ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. లైన్‌మెన్‌ల స్థానంలో ఆపరేటర్ల ద్వారా పనులు చేయించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కందుకూరు డివిజన్

90102 24456

Office mail : sakshiongads@gmail.com